# జమిందారు విల్లు

"నీపేరేనా చిరంజీవి?...." బట్టతల నిమురుకొంటూ, పెద్దపులిలా గాండ్రిస్తూ అడిగాడు జగన్నాథం.

"అవునండీ!....అంటే అసలు చాలామంది చిరంజీవులుంటారనుకోండి. నేను అందులో ఒక చిరంజీవినండీ! అంతెందుకూ మా కాలేజీలోనే ఆరుగురు చిరంజీవులుండేవారండీ మొత్తం..." చిరంజీవి మిగతా మిగతా అయిదుగురు చిరంజీవుల్నీ గుర్తు తెచ్చుకోబోతూంటే హడావుడిగా అడ్డు పడ్డాడు జగన్నాధం.

"అప్రస్తుతం! అప్రస్తుతం!" అరిచాడు జగన్నాధం.

"ఏమిటీ?" ఆశ్చర్యంగా అడిగాడు చిరంజీవి.

"అప్రస్తుతం" గర్జించాడాయన.

"ఏమిటి అప్రస్తుతం?"

"అదే ఆరుగురు చిరంజీవుల విషయం..."

"ఏ ఆరుగురు చిరంజీవులు?"

"అదే! మీకాలేజీలో చిరంజీవులు వెరసి - ఆరుగురు!"

"ఆ! అవును! మొత్తం ఆరుగురు- అంటే నన్ను కలుపుకొని అనుకోండి! ఫైనలియర్లో...."

జగన్నాధం కోపంగా అరచాడు.

"అనవసరం - అనవసరం - అనవసరం!"

చిరంజీవి అర్థమైనట్లు తల పంకించాడు.

"ఓహో- ఆ చిరంజీవులందరి సంగతీ ఇప్పుడు అనవసరం అంటారా?"

"అవును! ముమ్మాటికీ!"

"ఫైనలియర్లో... గొడవచేసి డిబార్ అయిపోయిన చిరంజీవి సంగతి కూడా అనవసరం అంటారా?"

"టు హెల్ విత్ దట్ చిరంజీవి!..." ఉద్రేకంగా అన్నాడు జగన్నాథం.

చిరంజీవి ఆపేశాడు. "సరే! పోనీండి! మీకు ఇబ్బందిగా వుంటే మరోసారి చెప్తాను...."

కొద్దిసేపు కోపంగా ఆ గదిలో పచార్లు చేశాడు జగన్నాథం.

చిరంజీవికి హఠాత్తుగా గుర్తుకొచ్చింది.

శ్రీలత ముందే చెప్పింది. వాళ్ళ నాన్న జగన్నాథాన్ని ప్రసన్నం చేసుకోవాలంటే ముందు. ఆ గదిలో గోడకి తగిలించి ఉన్న మోడ్రన్ ఆర్ట్‌చిత్రం గురించి పొగడమంది!

"ఆ చిత్రం చాలా అర్థవంతంగా, అద్భుతంగా ఉంది అది వేసింది ఎవరూ?" అడిగాడు చిరంజీవి! నిజానికి ఆధునిక చిత్రకళంటే పరమద్వేషం చిరంజీవికి. అందులో తన కర్థమయ్యేదేమీ ఉండదు. ఇప్పుడీ చిత్రం కూడా తన అభిప్రాయాన్ని మరింత బలపర్చేదిగా ఉంది. అదివేసింది జగన్నాథమే అన్నవిషయం కూడా తెలుస్తూనే ఉంది.

"అద్భుతంగా ఉందా?"

"అవును! చాలా అర్థవంతంగా కూడా ఉంది..."

"నీకు ఆధునిక చిత్రకళ గురించి తెలుసా?"

"తెలియడమేమిటి? అది నా ప్రాణం!"

"చాలా సంతోషం- చాలా సంతోషం!-" జగన్నాథం మొఖం ప్రసన్నకరంగా మారిపోయింది.

"ప్రస్తుతానికి నా దగ్గర డబ్బులేదు! లేకపోతే ఆ చిత్రానికి పదివేల రూపాయలుఇచ్చి నేనే కొనుక్కొనేవాడిని..."

"పదివేల రూపాయలా?"

"పదిహేను వేలయినా ఫరవాలేదు- నేను తక్కువ చెప్పాను - మనలో మనమే కదా, కొనుక్కొనేదీ అని...."

జగన్నాథం ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యేడు.

"నువ్వెక్కడ ఉద్యోగం చేస్తున్నావ్?"

"ఎస్సెస్ కమర్షియల్స్‌లో సీనియర్ గుమాస్తాని...."

"అవునవును! అమ్మాయి చెపింది! నీ జీతమెంత?" చిరంజీవి తటపటాయించాడు.

"ఫరవాలేదు! ఫరవాలేదు! చెప్పు! దాని ఓనర్ నా స్నేహితుడేలే..."

గతుక్కుమన్నాడు చిరంజీవి.

శ్రీలత నెలకు వెయ్యిరూపాయల జీతం అని అబద్ధం చెప్పమంది. మరీ ముసలాడేమో ఓ ఫరమ్ ఓనర్ తన స్నేహితుడంటున్నాడు. నిజంచెప్పక తప్పలేదు చిరంజీవికి. "అరవై అయిదు!...."

"అరవై అయిదా?"

"అవును?"

"ఏమిటి అరవై అయిదు?"

"అరవై అయిదు రూపాయలు..."

"ఐసీ...." మళ్ళా కోపం చోటు చేసుకొంది జగన్నాథంలో. తన కూతురు ఇలా అరవై అయిదు రూపాయలు జీతం తెచ్చుకొనే అడ్డగాడిదలని ప్రేమిస్తుందని కలలో కూడా అనుకోలేదు తల్లిలేని పిల్లని గారాబంగా పెంచితే చివరకి ఆస్థీఅంతస్తులు లేని ఈ దౌర్భాగ్యుణ్ణి ప్రేమించానంటుందా?

"గెటప్!" కోపంగా అరచాడు జగన్నాథం.

"ఏమిటీ?" ఆశ్చర్యంగా అడిగాడు చిరంజీవి.

"అయ్‌సే గెటప్!" చేతికర్ర తపాకిలా పైకిలేపి పట్టుకున్నాడు జగన్నాథం.

"ఓహో! ఇక లేద్దామంటున్నారా?" లేచి నుంచుంటూ అన్నాడు చిరంజీవి నవ్వుతూ.

"గెటవుట్!" బయటకు దారి చూపుతూ అన్నాడు జగన్నాథం.

చిరంజీవికి అర్థమయిపోయింది.

"అంటే– నాకూ, మీ అమ్మాయ్ శ్రీలతకూ మధ్య గాఢంగా అల్లుకున్న ప్రేమను మీరు హర్షించడం లేదన్న మాట!"

"ముందు బయటకు నడు!"

"అంటే – మీరు మా ఇద్దరినీ ఒకటి చేయకూడదని ఖచ్చితంగా నిర్ణయం చేసుకొన్నారన్నమాట..."

"అయ్‌సే గెటవుట్!"

"సరే! అలాగయితే మీకోమాట చెప్పాలి..."

"ఏమిటది?"

"నాకు ఆధునిక చిత్రాలంటే పరమ అసహ్యం! మీరు వేసిన ఆ చిత్రం దరిద్రంగా పరమ ఛండాలంగా, అర్థం పర్థం లేకుండా ఉంది! ఇదే నేను చెప్పదల్చుకొంది..." బయటకు నడిచాడు చిరంజీవి.

జగన్నాథం నోరు తెరచుకుపోయింది. నీరసంగా సోఫాలో కూలబడి పోయాడు.

"మరొక్కమాట" కిటికీలో నుంచి చిరంజీవి గొంతు వినిపించింది. భయంగా అటువేపు చూశాడు జగన్నాథం.

"ఆ చిత్రాన్ని పదివేల రూపాయలుకి కొనవచ్చని ఇందాక అన్నాను. ఇప్పుడు ఆ అభిప్రాయం మార్చుకొంటున్నాను..."

"అంటే– ఇప్పుడు అది పదివేలు ఖరీదు చేయదా?"

"చేస్తుంది! కాని దాన్ని మీరు వెంటనే అగ్గిపుల్ల గీసి  తగలేస్తేనే ఆ ధర ఇస్తాను!... అదీ– డబ్బున్నప్పుడు–"

జగన్నాథం పిడికిళ్ళు బిగుసుకుపోయినయ్.

"ఏమయింది? మాడాడీ ఒప్పుకున్నారా?" ఆత్రుతగా అడిగింది శ్రీలత.

"మన పెళ్ళి విషయం – గోడకి తగిలించిన  ఆయన ఆధునిక చిత్రకళ విషయం తప్ప మిగతా అన్నింటిలోనూ ఒకే అభిప్రాయాలున్నాయ్ ఇద్దరికీనూ!"

"అంటే పెళ్ళికి ఒప్పుకోనన్నారా?"

"గెటవుట్ అంటే అర్థం బహుశా అదే అయ్యుంటుంది."

"మరిప్పుడేమిటి చేయటం?"

"నాకు ఆస్థి వచ్చేవరకూనో, లేక మీ నాన్న ఆస్థి పోయేవరకూనో ఆగాల్సిందే!"

"ఈ రెండూ జరిగేయేనంటావా?"

"ఏమో! దేవుడు దయ గలవాడు అన్నారు!"

"ఎవరు?"

"తెలీదు!"

"పోనీ మనిద్దరం పారిపోయి, పెళ్ళి చేసుకుందామా?"

"ఈ అరవై అయిదు రూపాయల జీతంతోనా?"

శ్రీలత ఉసూరుమంది ఆ విషయం గుర్తుకొచ్చి!

"అయినా మరీ అరవై అయిదురూపాయలకు నువ్ పని చెయ్యడమేమిటి? వేరేచోట ప్రయత్నించకూడదూ?"

"త్నిద్దాం, త్నిద్దాం!" అన్నాడు చిరంజీవి ఆలోచనలో పడుతూ.

"సరే– నేను వెళ్తున్నాను...." నిరాశగా లేచి నుంచుంది శ్రీలత.

"పోనీ – ఈసారికి మీ డాడికి నచ్చిన కుర్రాణ్ణి చూసి ప్రేమించరాదూ?"

"వ్వెవ్వెవ్వె..." వెక్కిరించి కోపంగా అక్కడనుంచి వెళ్ళిపోయింది శ్రీలత.

"చిరంజీవి ఆలోచనలో పడిపోయాడు మళ్ళీ లేచేసరికి చీకటి పడిపోయింది పూర్తిగా"

"మీకు రిజిస్టర్ లెటర్ వచ్చింది..." వినయంగా అన్నాడు పోస్టుమెన్.

"నాకా!"

"అవును!"

"రిజిస్టర్ పోస్టా?"

"అవును."

"అంటే ఇప్పుడు నేనేం చెయ్యాలి? ఏమీ అనుకు. నాకు యిలాంటి రిజిష్టర్ ఉత్తరాలెప్పుడూ రాలేదు!"

"అలాగాండీ! నాకూ ఇదే మొదటిదండీ– నా సర్వీసులో! అసలు నా సర్వీసే పద్నాలుగు రోజులనుకోండి! ఇవాళ్టితో పదిహేనురోజులు నిండుతాయ్..."

"అలాగయితే మనిద్దరం ఏం చేయాలిప్పుడు?"

"ఇదుగో – ఇక్కడ సంతకం పెట్టాలండీ! మాతోటి పోస్టుమన్ చెప్పాడండీ అలా అని...'

చిరంజీవి సంతకం పెట్టి కవరు అందుకున్నాడు. కవరు మీద తన అడ్రస్ స్పష్టంగా వుంది. ఎవరో అడ్వకేట్ నుంచి వచ్చిందది.

కవరు చించి లోపలి కాగితం బయటకు లాగాడు. చదువుతూంటే అతని మొఖం నెమ్మదిగా వికసించసాగింది. అది చూసి పోస్టుమన్ ముచ్చటపడ్డాడు.

"ఇంతకూ ఏమిటండీ?" అడిగాడు ఆత్రుతగా.

చిరంజీవి అతని వంక జాలిగా చూశాడు.

"నీ జీతం ఎంతోయ్?"

"రెండువందల యాభైసార్..." దిగులుగా చెప్పాడు పోస్టుమన్.

"పాపం! ఎలా సరిపోతుంది?"

"చాలదండీ..."

"ఇబ్బందే..."

"చాలా ఇబ్బందండీ.."

"ఇంత ఆస్థికి వారసుడనైనా గాని నాకే డబ్బుకి ఇబ్బందిగా ఉంటోంది!"

"ఎంత ఆస్థికి వారసులండీ మీరు?" అనుమానంగా అడిగాడు పోస్టుమన్.

"అదింకా తెలీదు! ఇప్పుడే కదా ఈ ఉత్తరం వచ్చింది. నేనంటే ప్రేమ, అభిమానం ఉన్న ఓ పెద్దమనిషి చనిపోతూ విల్లులో నాపేరు కూడా రాశాడనీ – వివరాలు తర్వాత తెలుపుతామనీ – ఆయన రాశాడీ ఉత్తరం!"

పోస్టుమన్ ఈర్ష్యగా చూశాడు చిరంజీవి వంక!

"అంటే.. నే నీ ఉత్తరం తెచ్చేవరకూ మీకు – మీరు అంత ఆస్థికి అధిపతులయ్యారన్న విషయం తెలీదన్నమాట–"

"ఉహూ! కాకపోతే కొంత అనుమానం ఉంది. ఎందుకంటే ఇరవై రెండో ఏట అదృష్టం గిర్రున తిరుగుతుందని ఓ జ్యోతిష్కుడు చెప్పాడు...."

"ఆయన అడ్రస్ ఓసారి ఇస్తారా? నేను చూపించుకుంటాను..."

"నిరభ్యంతరంగా చూపించుకో! కానీ ఇప్పుడు కనుక్కోవడం కొంచెం కష్టం అనుకొంటాను! అతను పదహారేళ్ళ క్రితం హైద్రాబాద్ – బెజవాడ రోడ్డుమీద ఓ చెట్టుక్రింద కూర్చుని ఉండేవాడు. అదెక్కడుండో గుర్తులేదుగానీ ఆ చెట్టు మాత్రం గానగచెట్టు!"

"కేరాఫ్ గానగ చెట్టన్నమాట – ఫరవాలేదులెండి! ఈ అడ్రస్ చాలు! నేను వెతికి పట్టుకుంటాను..."

రివ్వున వెళ్ళిపోయాడు పోస్టుమన్!

చిరంజీవి లేచి నుంచున్నాడు. అతనికి ఇంకా నమ్మసక్యం కావటం లేదు! త్వరత్వరగా ఆఫీస్‌కి బయల్దేరాడు. అప్పటికే అరగంట ఆలస్యం అయిపోయింది.

సీట్లో కూర్చోమండగా ఫ్యూన్ పరుగెత్తుకొచ్చాడు.

"అహహ.. కూర్చోకండి! ముందు ఆఫీసరుగారిని చూచి తర్వాత కూర్చోమని చెప్పారాయన–"

చిరంజీవి నిర్లక్ష్యంగా స్వింగ్‌డోర్స్ తెరచుకొని ఛీఫ్ ఆఫీసర్ గదిలోకి అడుగుపెట్టాడు. ఛీఫ్ కెదురుగ్గా ఉన్న కుర్చీలో దర్జాగా కూర్చుని, జేబులోంచి సిగరెట్ తీసి నోట్లో పెట్టుకుని "అగ్గిపెట్టుందా?" అనడిగాడు చీఫ్‌ని.

అంతవరకూ 'మాస్' పిక్చర్ చూస్తున్నట్లు కళ్ళప్పగించిన ఛీఫ్ మండిపోయాడు. ఆ మంటతో సిగరెట్ వెలిగించుకున్నాడు చిరంజీవి.

"ఎంత పొగరు? ఎంత ధైర్యం? అరగంట ఆలస్యంగా వచ్చింది కాకుండా..." అరచాడు బాస్.

"ష్! గొడవ చెయ్యకు!" పొగరింగులు వదుల్తూ అన్నాడు చిరంజీవి.

"ఏమిటీ?" అదిరిపడ్డాడు ఛీఫ్.

"మన కంపెనీ విషయం ఆలోచిస్తున్నాను... ఈ కంపెనీని నేను కొనాలా వద్దా అని.."ఛీఫ్ అనుమానంగా చూశాడు చిరంజీవి వంక. డైరెక్టరీ తీసి పిచ్చాసుపత్రి ఫోన్ నంబరు వేరే కాగితం మీద రాసుకొని మళ్ళీ చిరంజీవి వంక చూశాడు.

"అన్నట్లు నీ జీతమెంత?" అడిగాడు చిరంజీవి.

"వాట్....?"

"నిన్ను నేను కంపెనీ తీసుకున్న తర్వాత కూడా ఛీఫ్ గానే ఉంచడానికి నిర్ణయించుకున్నాను..."

"చాలా థాంక్స్! నిన్ను ఇప్పుడే డిస్మిస్ చేస్తున్నాను. నీకు పిచ్చి ఎక్కింది...'

చిరంజీవి పగలబడి నవ్వాడు.

ఛీఫ్‌కి నమ్మకం కుదిరిపోయింది! ఖచ్చితంగా పిచ్చేనని, చిరంజీవి జేబులోనుంచి తన కొచ్చిన రిజిష్టర్డు ఉత్తరం తీసి చూపించాడు.

"వ్వాట్..." అన్నాడు ఛీఫ్ చదువుతూ!

అతని మొఖంలో భయం, ఖంగారు చోటు చేసుకున్నాయ్. సర్కస్‌లో రింగు మాష్టర్ వంక చూస్తోన్న పెద్దపులిలా దీనంగా చూశాడు చిరంజీవి వేపు.

"మిష్టర్ చిరంజీవి! యీ ప్రపంచంలోకెల్లా అదృష్టవంతులు మీరు! యీ చనిపోయిన జమీందారుకి లక్షల ఆస్థి ఉంది! అంటే మీరు లక్షాధికారులన్నమాట!"

చిరంజీవి వేదాంతిలా నవ్వాడు.

"ఆ డబ్బు దేముంది రామారావ్? ఇవాళ వస్తుంది. రేపు పోతుంది!"

తనను "ఛీఫ్" అనకుండా "రామారావు" అని పేరు పెట్టి పిలిచినందుకు అతను అమితంగా ఆనందపడిపోయాడు.

"ఇంత గొప్పవారయి పోతారని నేనెప్పుడూ అనుకోలేదు సార్!" వినయంగా అన్నాడు ఛీఫ్.

"అఫ్‌కోర్స్ – అఫ్‌కోర్స్..."

"సార్! మీరీ కంపెనీ కొనేటట్లయితే నన్ను డిస్మిస్ చేయకండి! ఇంతకాలం మిమ్మల్ని అవమానించిన విషయం దయచేసి మరచిపోండి! కేవలం మీ మీద అభిమానంతోనే అలా అన్నాను–"

"ఫరవాలేదోయ్! నువ్వు దిగులు పెట్టుకోకు" జాలిగా అన్నాడు చిరంజీవి. అని అక్కడే ఉన్న ఫోన్ తీసుకుని శ్రీలత ఇంటికి ఫోన్ చేశాడు.

"ఎవరూ?" అన్నాడు జగన్నాథం ఫోన్ అందుకొని.

"నేను చిరంజీవిని మాట్లాడుతున్నాను."

"శ్రీలతతో మాట్లాడ్డానికి వీల్లేదు!"

"శ్రీలతా? ఎవరామె?" ఆశ్చర్యంగా అడిగాడు చిరంజీవి.

"తెలీకపోతే పో! నేను చెప్పను–"

"ఫరవాలేదు! మా రూము దగ్గర పద్నాలుగురు ఆడపిల్లల తండ్రులు! వాళ్ళమ్మాయిల ఫోటోలు పట్టుకొచ్చారు! అందులో ముగ్గురు శ్రీలతలున్నారు–"

"ఇప్పుడు నీకేం కావాలో చెప్పు–"

"ఇంటిదగ్గరే ఉండు! వస్తున్నాను–" ఫోన్ పెట్టేశాడు చిరంజీవి.

"రామారావ్? నీ కారులో జగన్నాథం ఇంటిదగ్గర డ్రాప్‌చేసెయ్! నేను కారుకొన్న తరువాత నిన్ను కూడా ఒకసారి డ్రాప్ చేస్తాను వారింటిదగ్గర–"

"ప్లెజర్ ప్లెజర్ ప్లెజర్– జగన్నాథం నాకూ కావలసిన వాడే – పదండి!"

రామారావు డ్రైవరులాగా కారు నడిపి జగన్నాథం ఇంటిదగ్గర ఆపాడు.

ఇద్దరూ లోపలికెళ్ళి కూర్చున్నారు.

"మళ్లీ ఎందుకొచ్చావ్! నా చిత్రం మీద మళ్ళీ అభిప్రాయం మార్చుకొన్నావా?"

"ఛస్తే మార్చుకోను! అది వట్టిచెత్త చిత్రం!"

"అలాగయితే గెటవుట్–"

"అమ్మమ్మమ్మ – జగన్నాథంగారూ! పొరబాటు, పొరబాటు, ఇప్పుడు చిరంజీవిగారు ఎవరనుకుంటున్నారు?"

"నెలకు అరవై అయిదు రూపాయలు తెచ్చుకొనే గుమాస్తాగాడు–"

"బాబోయ్ బాబోయ్–– 'గాడు' అన్నారా?"

"అన్నాను!"

"కళ్ళు పోతయ్!"

"పోయినాసరే, అంటాను-"

"వాడు 'అజ్ఞాని' రామారావ్! వాడినేమీ అనకు!" జాలిగా అన్నాడు చిరంజీవి.

"వ్వాట్?...." కోపంతో అరచాడు జగన్నాధం బట్టతల నిమురుకుంటూ.

"జగన్నాధం ఇలారా ఓ మాట!" పక్కకు లాక్కెళ్ళి చెవిలో గుసగుసలాడారు రామారావ్.

"నేన్నమ్మను...." ఆశ్చర్యం గానూ, పిరికిగానూ అన్నాడు జగన్నాధం.

"అజ్ఞానం" అన్నాడు చిరంజీవి జేబులో నుంచి రిజిష్టర్డు లెటరుతీసి టీపాయ్ మీదకు విసిరేస్తూ.

అది చదివి ఆలోచనలో పడిపోయారు జగన్నాధం.

"ఆ ఉత్తరం రాసిన లాయర్స్ మన ఆంధ్రదేశంలో చాలా పేరున్నవాళ్ళు! అంటే... మరి నిజంగానే ఆ జమీందారు నీ పేరు విల్లు రాశాడంటావా?" అడిగాడు జగన్నాధం.

"అబద్ధమాడటం మా లక్షాధికారుల వంశంలోనే లేదు..." అన్నాడు చిరంజీవి.

"ఆ జమీందారుకి మీరెలా తెలుసు?" మర్యాదగా అడిగాడు జగన్నాధం.

"ఓసారి ఆయనా నేనూ టాంక్‌బండ్ మీద కలుసుకొని చాలాసేపు మాట్లాడుకొన్నాం?"

"దేన్ని గురించి?"

"కుక్కల గురించి!"

"కుక్కల గురించా?"

"అవును! కుక్కలు.. అందుగల వివిధ జాతులు.... మంచి కుక్కల గుర్తించడం ఎలా? వాటి ఆహారపుటలవాట్లు- వగైరా వగైరా...."

"కేవలం కుక్కల గురించేనా మాట్లాడింది?"

"ఆధునిక చిత్రకళ గురించి కూడా మాట్లాడాము..."

"ఏమని?"

"అది వట్టి చెత్త అని. ఇద్దరం అంగీకరించాము..."

జగన్నాధం కోపంగా లేవబోయాడుగాని చిరంజీవి చేతిలో ఉత్తరం కంటపడేసరికి మళ్ళీ కూర్చుండి పోయాడు.

"ఐసీ–" అన్నాడు ఆలోచనలో పడి.

"శ్రీలత తల్లిలేని  పిల్ల–" అన్నాడు కొద్దిసేపాగి.

"ఏ శ్రీలత?"  అడిగాడు చిరంజీవి ఆశ్చర్యంగా.

"ఎందుకంటే మా ఇంటికి పద్నాలుగు మంది ఆడపిల్లల తండ్రులొచ్చారు అందులో ముగ్గురు శ్రీలతలు..."

"నేననేది మా అమ్మాయ్  శ్రీలతను గురించి!..."

"ఓహో ఆ శ్రీలతా! ఆ అమ్మాయ్ గురించి మాట్లాడేందుకేముందీ? పూర్‌గాళ్! పెళ్ళి చేసుకొందామని నిన్నటి వరకూ అనుకొన్నాను... లక్షాధికారిణి అయిపోయేది! వాళ్ళ నాన్న వప్పుకోక పోయేసరికి నా అభిప్రాయం మార్చేసుకొన్నాను. బైదిబై ఆ  అమ్మాయి తండ్రి నువ్వేకదూ?"

"అవునండీ! పొరబాటయి పోయింది! పొరబాటున ఇలాంటి పొరబాటు పనులు చేస్తూంటా, నేనొకోసారి!" బ్రతిమాలాడు జగన్నాథం.

"దట్సాల్‌రైట్. ఫోటో పంపించు! చూస్తాను.."

"అంతమాటనకండి! అమ్మాయ్ మొహం చూసయినా– అమ్మాయ్ శ్రీలతా!"

హడావుడిగా శ్రీలతని పిలిచాడు జగన్నాథం.

శ్రీలత నెమ్మదిగా వచ్చిందక్కడికి.

"ఇంకో గంటలో లగ్నం ఉంది! వెళ్దామా మరి..." అడిగాడు జగన్నాథం.

"ఆధునిక చిత్రకళ గురించి మరి మనిద్దరికీ అభిప్రాయభేదాలు..."

"సారీ సార్! నేనూ ఒప్పుకుంటున్నాను! నా చిత్రం వట్టి చెత్త..."

"సరే – పెళ్ళి ఎక్కడ?"

"హోటల్ సరోవర్‌లో! మా ఫ్రెండ్స్ అంతా సాయంత్రాలు అక్కడే ఉంటారు."

"వాళ్ళందరి సమక్షంలో దండలు మార్పించేద్దాం..."

"కాని... నేను సొంత కారు కొనుక్కోందే పెళ్ళివద్దను కొన్నాను...."

"దాన్దేముందీ? నా కారు ఇప్పుడే మీ పేర రాసిచ్చేస్తున్నాను–"

"డబ్బు తరువాతిస్తాను! నా దగ్గర 'కాష్'లే దిప్పుడు..."

"దాన్దేముందీ? గొప్పోళ్ళ దగ్గర ఎప్పుడూ కాష్ ఉండదు.."

"చిరంజీవి జేబులోనుంచి చెక్కు పుస్తకం తీసి ఇరవై వేలకు చెక్కు రాశాడు....

"నా కారు పదివేలే చేస్తుంది..." సంభ్రమంగా అన్నాడు జగన్నాధం.

"మరో పదివేలు. నీ 'చిత్రం' తగలెయ్యడానికిస్తున్నాను.."

"తగలెయ్యడానికే?" ఏడుపుమొఖంతో అన్నాడు జగన్నాధం.

"అవును!– అదీ ఇప్పుడే జరగాలి..."

ఏడుపు ఆపుకుంటూ ఆ చిత్రం తగలేశాడు జగన్నాధం.

"ఇంక వెళ్దామా మరి?"

"ఆల్‌రైట్ – పద శ్రీలతా! డార్లింగ్"

శ్రీలత విస్తుపోయి చూస్తూ అతనివెంట నడిచింది. సరోవర్‌లో జగన్నాధం స్నేహితుల మధ్య ఇద్దరూ దండలు మార్చేసుకొన్నారు.

మర్నాడు కార్లో జగన్నాధం – శ్రీలతా – చిరంజీవి– జమీందారుగారి ఊరు చేరుకొన్నారు. బయట కొన్నివందలమంది గుంపులు గుంపులుగా నుంచుని ఉన్నారు.

లాయర్లు ఉన్న గదిలోకి నడిచారు జగన్నాధం – చిరంజీవీ!

"నా పేరు చిరంజీవి!" అన్నాడు చిరంజీవి.

"మిమ్మల్ని కలుసుకొన్నందుకు చాలా సంతోషంగా వుంది!" అన్నాడు లాయర్? ఫైలుతీసి చూస్తూ.

"మా అల్లుడికి ఎన్ని లక్షలు వస్తుంది– విల్లు ప్రకారం?" అడిగాడు జగన్నాధం ఆత్రుతగా. "ఏమిటి ఎన్ని లక్షలు?" ఆశ్చర్యంగా అడిగాడు లాయరు.

"అదే డబ్బు!..."

"ఏం డబ్బు?"

"అదే డబ్బంటే – మామూలు డబ్బు! విల్లు ప్రకారం జమీందారుగారు.."

"అదా!"

"అవును! అదే..."

"ఆ బయట నుంచున్న వాళ్ళనందర్నీ చూశారా?' అడిగాడు లాయరు.

“చూశాను! జమీందారు చనిపోయినందుకు విచార సూచకంగా మూగినట్లున్నారు–” జాలిగా అన్నాడు చిరంజీవి.

“కాదు, కాదు!” అన్నాడు లాయర్.

“వాళ్ళంతా విల్లులో పేర్లున్నవాళ్ళు...”

“అంటే?” ఆశ్చర్యంగా అడిగాడు చిరంజీవి.

“వ్వాట్?” ఇంకా ఆశ్చర్యంగా అన్నాడు జగన్నాథం.

“మీకు తెలీందేముందీ? జమీందారుగారికి కుక్కలంటే చాలా ఇష్టం! ఆయన పెంచుకున్న కుక్కల్ని గురించి ఎవరు పొగిడినా – వాళ్ళందరి పేర్లూ నోట్‌చేసుకొని, చివరకు విల్లులో రాసేశారు. విల్లులో మొత్తం పదహారువందల డెబ్భై రెండుమంది పేర్లున్నాయ్. వాళ్లందరికీ ఆస్తి సమంగా పంచితే ఒక్కొక్కరికి రెండువందల అరవైఅయిదు రూపాయ లొచ్చినయ్! చిరంజీవిగారి పేర వ్రాసిన చెక్కు ఇదిగో –ఇంతేగాక చిరంజీవిగారి మీద జమీందారుగారికి ఎక్కువ అభిమానం ఉండటం చేత వారికి ప్రియమైన ఆల్సేషన్ కుక్కని కూడా రాసిచ్చేశారు..” అని బెల్ నొక్కాడు చిరంజీవి.

ఓ నౌకరు మనిషంత ఎత్తు ఉన్న కుక్కని గొలుసుతో లాక్కొచ్చి చిరంజీవి చేతికి గొలుసిచ్చేడు.

“ఇంక మీరు వెళ్ళవచ్చు...” అన్నాడు లాయర్. జగన్నాథం మొహం కోపంతో జేవురించుకు పోయింది.

“కుక్క చాలా బావుంది–” అన్నాడు చిరంజీవి ప్రేమగా దాని వంక చూస్తూ.

“టు హెల్ విత్ ది డాగ్...” అరచాడు జగన్నాథం.

“అలా అనకండి! జమీందారుగారి ఆత్మ ఈ చుట్టుపక్కలే ఎక్కడో తిరుగుతుంటుంది. విందంటే మీ పీక పట్టుకుంటుంది! బైదిబై మీకు దయ్యాలమీద నమ్మకం ఉందా?”

“టు హెల్ విత్ ది డెవిల్స్ ...” మళ్ళీ కోపంగా అరచాడు జగన్నాథం.

“ఓహో! కుక్కలమీదా – దయ్యాలమీదా ఒకటే అభిప్రాయమన్నమాట మీకు?”

కుక్కని చేత్తో పట్టుకొని – మరోచెయ్యి శ్రీలత భుజం మీద చేయి వేసి కారు దగ్గరకు నడిచాడు చిరంజీవి.

శ్రీలతకి నవ్వాగటం లేదు.

‘నా కారెక్కడానికి వీల్లేదు..” అడ్డంగా వస్తూ అన్నాడు జగన్నాథం.

“కారు నా పేర రాసిచ్చావు! పదివేలకి కొన్నాను...” అన్నాడు చిరంజీవి.

"ఆ చెక్కు చెల్లదు..." అన్నాడు జగన్నాథం. "ఇప్పుడు చెల్లకపోవచ్చు అందుకే తారీఖు వేయలేదు.. అయినా మనం ఎప్పటికయినా ఆ చెక్కు చెల్లుతుందన్న ఆశలేనిదే మనిషి బ్రతకడం కష్టం – బైదిబై మీకు ఆప్టిమిస్టా – పెసిమిస్టా!"

చిరంజీవి – శ్రీలతతో పాటు కుక్క కూడా కారెక్కేసింది.

'మీకూ – కుక్కకీ పడదు కాబట్టి మీరు వెనుకసీట్లో కూర్చోండి' అన్నాడు చిరంజీవి.

జగన్నాథం వెనకసీట్లో కూర్చున్నాడు.

కారు వేగంగా నడపసాగింది శ్రీలత.

కుక్క ఆనందంగా కారు కిటికీలోనుంచి తల బయటకు పెట్టి చూడసాగింది.

'అయ్ లైక్ డాగ్స్–' అన్నాడు చిరంజీవి. 'అయ్ హేట్ డాగ్స్ –' వెనకనుంచి అరచాడు జగన్నాథం.

అల్సేషన్ కుక్క బొంయ్‌మంటూ జగన్నాథం వేపు దూకింది.

కారు ఆపేసింది శ్రీలత.

"ఆ కుక్కకి ఇంగ్లీష్ వచ్చు! దానికీ మీకూ అలా అభిప్రాయభేదాలు వచ్చినప్పుడు దానికి కోపం వస్తుంది! కనుక దానికి 'సారీ' చెప్పుకోండి" అన్నాడు చిరంజీవి.

జగన్నాథం 'సారీ డాగ్! సారీ! ఫర్ గివ్‌మీ... ' అనేసి భోరున ఏడ్చేశాడు. కుక్క తన కాళ్ళు అతడి గుండెల మీద నుంచి విత్‌డ్రా చేసుకుంది.

కారు మళ్ళీ బయల్దేరింది.